

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి:అరకు-ప్రధాన రహదారి కాశీపట్నం, బంగారంపేటను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు మాయం పై పలు దిన పత్రికలలో వరుస కధనాలకు స్పందించిన రెవిన్యూ అధికారులు తిరిగి బోర్డు ఏర్పాటు చేశారు. మండలం లో కాశీపట్నం పంచాయతీ బంగారంపేట రెవెన్యూ సర్వే 13లో 1, 13లో 2లో గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించడం పై పలు దినపత్రికలలో వార్తా కథనాలు ప్రచురించాయి. అలాగే సీపీఎం నాయకులు తహాశీల్దార్‌కు పిర్యాదు చేయడంతో స్పందించిన కాశీపట్నం పంచాయతీ విఆయర్, సిబ్బందితో గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

నిర్మాణానికి నోచుకోని రోడ్డు పనులు

నిధులు మంజూరై ఐదేళ్లు గడుస్తున్నా...

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మారుమూల గిరిజన గ్రామాల్లో రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసినా స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు జరగక పోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు తప్ప లేదు. మండలంలోని సొవ్వ పంచాయితీ కమలబంధలో బిటి రోడ్డు నిర్మాణానికి గత 2019లో నిధులు మంజూరైన ఇప్పటికీ సుమారు ఐదేళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించక పోవడమే ఇందుకు నిదర్శనం. సోవ్వ రోడ్డు జంక్షన్ నుంచి ఆ గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. ప్రస్తుతం ఆ గ్రామంలో మట్టి రోడ్డు ఉన్నప్పటికీ వర్షాకాలంలో రోడ్డు అంతా బురదమయంగా మారుతుండటంతో రవాణా సౌకర్యానికి ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేక పోవడంతో గ్రామస్తులు ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డుపైన బురద పేరుకు పోతుండంతో వాహనాలు జారి పోతూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ గ్రామస్తులు తెలిపారు. పనులు ప్రారంభానికి శంకుస్థాపన చేసి నిర్మాణాలను చేపట్టకుండా నిలిపేశారు. రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కమలబందలో మంజూరైన నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రవాణా కష్టాలు తీర్చాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.



నిర్మాణానికి నోచని కమలబంధ రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో వేసవికాలంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పిఒ సూరజ్ గనోరే గురువారం ఏజెన్సీలో తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలతో సహా అన్ని గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా యాక్షన్ ప్లాన్ ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో మొత్తం 3550 హ్యాండ్ బోర్లు ఉన్నాయన్నారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని బోర్లు ఉన్నాయి, వాటిలో తాగునీటి కోసం ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి, తాగడానికి పనికి రాని, వాడుకోవడానికి పనికి వచ్చే బోర్లు వివరాలపై ఆరా తీశారు. ఏజెన్సీలోని సత్యసాయి పథకం, జల్ జీవన్ మిషన్ ద్వారా ఎన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీరు అందుతున్నదీ మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఏయే గ్రామాలలో వాటర్ ట్యాంకులు, ఎన్ని ఉన్నాయో మండలాల వారీగా ఆరా తీశారు. ప్రజలు కాలువలు, చెలమలు ద్వారా తాగునీరు వాడుకుంటున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు తాగునీరు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. హ్యాండ్ బోర్లు రిపేర్లు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్ర బాబు, శివ, యస్‌ఓ టి.మార్తమ్మ, ఏడు మండలాలకు సంబంధించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలి

-మాస్టర్ ట్రెయినీలకు కలెక్టర్ విజయసునీత ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు:రానున్న ఎన్నికలకు కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ప్రతి అంశంపైనా శిక్షణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత మాస్టర్ ట్రెయినీలను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, అన్నీ తెలుసుననే భావం ఎవ్వరికీ ఉండకూడదని, ప్రతి చిన్న విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుండి వచ్చే సూచనలు, నిభందనలు, మార్పులు, చేర్పులు గమనిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. శిక్షణలు ఎప్పటికప్పుడు నవీకరణకు తోడ్పడతాయని తెలిపారు. సమాచారం చేరవేయడంలో అలసత్వం, జాప్యం ఉండరాదన్నారు. ఇవిఎంల వినియోగంలో చిన్న పొరపాటు కూడా జరగరాదని, ఉంటే వాటిని సరిదిద్దుకునే అంశాలను ఎన్నికల సిబ్బందికి అర్థం అయ్యే రీతిలో తగు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి చిన్న విషయం అట్టడుగు క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు చేరే విధంగా శిక్షణ ఉండాలన్నారు. ఓటింగ్ పూర్తైన తరువాత నాలుగు రకాల సీల్స్ వేయాలని, ఓటింగ్ లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య మెషిన్‌పై చూపించిన నంబరు, పిఒ డైరీలో నంబర్, ఓటింగ్ స్లిప్పులు తదితర ఐదు రకాల నంబర్లు ఒకేలా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు భావన వశిస్ట్, వి.అభిషేక్, డిఆర్‌ఓ బి.పద్మావతి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత



మాట్లాడుతున్న డిఇఒ బ్రహ్మాజీ

ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ (ఐఇ) అనేది అంగవైకల్యం ఉన్న పిల్లలకు విద్యను అందించడం, నేర్చుకోవడంలో ఇబ్బందులున్న పిల్లలకు ఎలా నేర్పించాలో ఐఇ విధానంతో సాధ్యమవుతుందని డిఇఒ బ్రహ్మాజీ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సుండ్రుపుట్టు ఎంపిపి పాఠశాలలో గురువారం ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై వన్డే ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు అవసరాన్ని బట్టి సహాయం అందించడం, పాఠశాల స్థాయిలో వికలాంగు పిల్లలను గుర్తించడం, విద్య అవసరాలను అంచనా వేయడం, విద్యాబుద్ధులు నేర్పడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు ఎలా పొందాలి, ప్రభుత్వం నుండి పెట్టుబడి, విద్యార్థుల అలవెన్స్, సదరం సర్టిఫికెట్ పొందాలన్న దానిపై వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఇ కో-ఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు, డిఇఒ కార్యాలయం, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దారు కృష్ణజ్యోతి తదితరులు

బిఎల్‌ఒల ద్వారా ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అంశాలపై ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బిఎల్‌ఓల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని స్థానిక తహశీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. మండలంలోని పోక్స్‌పేట, ఎర్రంపాలెం, గోపవరం, ఐ.పోలవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహశీల్దారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ గ్రామాల్లో ఓటర్లకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, వికలాంగులకు ఎన్నికల సంఘం నిబంధన మేరకు ర్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. వికలాంగులు ఓటు వేయడానికి వచ్చినప్పుడు లైన్లో లేకుండా కొంచెం వెసులుబాటు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్, వీఆర్వోలు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అధ్యక్షులుగా ఆశీర్వాదం

ప్రజాశక్తి- అడ్డతీగల



జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం తూర్పుగోదావరి అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా అనూప్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ సిహెచ్.ఆశీర్వాదం మూడో సంవత్సరం కొనసాగిస్తున్నామని జై ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు బిహెచ్ సుమిత్రానందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అసోసియేషన్లో ఆర్టిఐ 2005 చట్టం ద్వారా పోరాడుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలో జిల్లాలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆశీర్వాదాన్ని పలు సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు

వాళ్ల వెంకటేశ్వరరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని జీడిగుప్ప గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు వాళ్ల వెంకటేశ్వరరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించగా, గురువారం ఆయన స్వగృహంలో జరిగిన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు సిపిఎం నాయకులు కార్యకర్తలు వెంకటేశ్వరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటేశ్వర రెడ్డి పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారని, ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు పనిచేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుంజా నాగిరెడ్డి, కారం సుందరయ్య, మల్లయ్య, కొండారెడ్డి, ఖాదర్, శాఖ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: గిరిజన హక్కులు, చట్టాల రక్షణకై నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని గన్నెల పంచాయితీ మారుమూల గ్రామాలైన చిడివలస, సభక, కెంటిబడి గ్రామలలో సిపిఎం నాయకులు పర్యటించారు. అరకు సిపిఎం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు పాంగి రామన్న మాట్లాడుతూ, నిరంతరం ప్రజల పక్షాన ఉండి గిరిజన హక్కుల చట్టాలు కోసం పోరాడే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. అటవీ సంపదను కాపాడాలంటే సిపిఎం అభ్యర్థులను చట్టసభలకు పంపించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిలను ఓడించాలని పిలుపునిచ్చారు. .జిఒ 3 రద్దు చేయడంతో గిరిజన ప్రాంత యువతీ యువకులు తీవ్రంగా అన్యాయమై పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.గాసి అప్పలస్వామి, ఎస్ రాజారావు, ఎస్ సీతన్న, ఎస్.అప్పలరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ కొములు

మెడికల్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కొర్రయి పంచాయితీ గత్తరజిల్లేడ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాపును ఆ పంచాయతీ సర్పంచ్ కొములు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సాయి తేజ మెడికల్ షాప్ ప్రారంభించడంతో కొర్రాయి, కొల్లాపుట్టు గిరిజనులకు వెంటనే ప్రథమ చికిత్స అందించడానికి మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతి పీసా అధ్యక్షుడు కే.గోపాల్, ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆరు ఇళ్లు దగ్ధం


రూ.20 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఎజి.కోడేరు పంచాయతీ పరిధి మల్లెతోట గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివాసీలకు చెందిన ఆరు ఇళ్లు, రెండు పూరిపాకలు అగ్నికి ఆహుతయ్యాయి. మల్లెతోట గ్రామస్తులు గురువారం కూనవరం మండలం పంరాజుపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంట పెళ్లికి వెళ్లారు. ఈ సమయంలో మల్లెతోట గ్రామంలో కాక శర్మయ్య ఇంటికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని క్రమంగా కాక ప్రసాద్, ముచ్చిక మల్లయ్య, ముచ్చిక బిగ్‌బాస్, ముచ్చిక కళ్యాణ్, కాక సీతమ్మ, గొర్రె పిచ్చిరెడ్డి తదితరుల ఇళ్లకు వ్యాపించింది. ఇది గమనించిన స్థానికులు అగ్ని ప్రమాదక కేంద్రానికి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించగా గ్రామంలో సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో సమాచారం ఆలస్యమైంది. ఎట్టకేలకు సమాచారం చేరడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆరు ఇళ్లు, రెండు పూరిపాకలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో కాక శిరమయ్య ఇంట్లో బంగారు తాడు, రూ.30 వేలు నగదుతో పాటు బాధితుల అందరి ఇళ్లలో తిండి గింజలు, వంట సామగ్రి, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు 20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా. ప్రమాద సమాచారం తెలుసుకున్న మండల తహశీల్దార్ నజీముల్లాషా ఘటన స్థలానికి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు. బాధితులకు కావాల్సిన నిత్యావసర సరుకులు, బియ్యం, పప్పు, నూనెలు తక్షణసాయంగా ప్రభుత్వం తరఫున అందజేశారు. సిపిఎం నాయకులు సీసం సురేష్, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జమాల్ ఖాన్, ప్రజా ప్రతినిధులు బాధ్యత కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.



కాలిబూడిదైన తాటాకు ఇళ్లు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు



బాధితులతో మాట్లాడుతున్న జమాల్‌ఖాన్

తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం జడ్డంగి గ్రామం చైతన్య నగర్ కాలనీలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి తాగునీరు అందించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు తెడ్ల రాంబాబు ఆధ్వర్యాన కాలనీ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామంలో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి మరమ్మతులకు గురైందని తెలిపారు. దీంతో సుమారు 70 కుటుంబాలు విద్యుత్ లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన మంచినీటి మోటార్‌కు కరెంట్ సరిపోకపోవడం వలన తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని 10 రోజుల నుండి అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గూడెం లక్ష్మి, బచ్చల బేబీ, గుర్రే మధురవాణి, డబ్బాకోట దుర్గాదేవి, వీరకోట నారాయణమ్మ, ఒంటిపల్లి మంగ, పుసం లావణ్య, లోత రామలక్ష్మి, పూసం అన్నపూర్ణ, దల్లే ఆదిలక్ష్మి, దాకమురి లావణ్య, తొంట రమణ, బుడమ మని, పసం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న చైతన్య నగర్ కాలనీ మహిళలు

పోస్టుమ్యాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -చింతపల్లి: స్థానిక తపాలా శాఖలో పోస్ట్ మ్యాన్ చిందాడ సత్యనారాయణ మరణం విచారకరమని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గం వైకాపా అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం విధులకు వెళుతూ అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మరణించారు. గురువారం చింతపల్లి అంబేద్కర్ కాలనీలోని భౌతిక కాయానికి పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరరాజు, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు నివాళి అర్పించారు. సత్యనారాయణ సతీమణి చింతపల్లి 2 ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రదీప

న్యాయ సేవ విజ్ఞాన సదస్సులను వినియోగించుకోవాలి

- పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరులో గిరిజన ప్రాంతంలో కుల ఆదాయ స్థిరనివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప సూచించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప మాట్లాడుతూ, కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యలను చర్చించుకొని పరిష్కరించే విధంగా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు అనుగుణంగా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయవలసి ఉంటుందని అన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే వాటిని అప్పీలు చేసుకోవచ్చని, వాటి పరిష్కారానికి రెవెన్యూ శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. చట్టాలను ఉల్లంఘించి తప్పుడు పత్రాలను పొందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, పాడేరు తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, లీగల్ అడ్వైజర్ ప్రసాద్ నాయుడు, ఆయా మండలాల తహసీల్దారులు ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రవరంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలంలోని ఎర్రవరంలో తెలుగుదేశం పార్టీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్ల దాడులకు పూనుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎర్రవరం పంచాయతీ గొల్లపేట రామాలయం వీధిలో మంగళవారం గంగాదేవి పండుగను నిర్వహించారు. ఈ వేడుకకు ఎర్రవరంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన యువకులు విచ్చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుండగా బయట నుంచి విచ్చేసిన యువకులకు, ఎర్రవరం గ్రామానికి చెందిన యువకులకు స్వల్ప వివాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను ఎర్రవరంలోని టీడీపీకి చెందిన అమరపల్లి నాగేశ్వరరావు ఫోన్ ద్వారా వీడియో తీస్తుండగా ఎర్రవరానికి చెందిన వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. దీంతో స్థానికులు కలుగజేసుకొని వివాదం సర్దుమణిగేందుకు ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరమపల్లి నాగేశ్వరరావు ఇంటిపైకి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాళ్లతో చేశారు. సాయంత్రం ఇరువర్గాల వారు ఇందుకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్టు గొలుగొండ ఎస్సై కృష్ణారావు విలేకరులకు తెలిపారు.


బాలిక ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఉన్నత చదువులతో మంచి భవిష్యత్తు

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: సమాజ అభివృద్ధికి విద్యార్థులే పునాదులని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. నవంబరు నెల నుండి పది పరీక్షల వరకు గుత్తులపుట్టు, దిగు మోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో 42 మంది గిరిజన బాల బాలికలకు ప్రత్యేక బోధన అందించారు. టెన్త్ విద్యార్థులతో గురువారం గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 7వ తేదీన కాలేజీ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని మంచి ర్యాంకులు సాధించి విశాఖ పట్నం, పార్వతీపురం కాలేజీ ఆఫ్ ఎక్స్ లెన్స్లో ప్రవేశం పొందాలని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుంటే తలిదండ్రులకు పుట్టిన ప్రాంతాలకు మంచి పేరొస్తుందన్నారు. అమ్మ,నాన్నలకు, ఉపాధ్యాయులకు గౌరవం పెరుగుతోందని చెప్పారు. గిరిజన ప్రాంతం మారాలంటే విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పురావాలని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు పాడేరు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులను, నగదు బహుమతులతో ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకుని ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్ -1 అధికారులుగా ఎదగాలని పేర్కొన్నారు. గత సంవత్సరం గిరిపుత్రులకు అందించిన సివిల్స్ కోచింగ్‌లో ముంచింగ్పుట్టుకు చెందిన విద్యార్థి డిఎస్పీ, మరొకరు గ్రూప్ -1 ఉద్యోగాలను సాధించారని గుర్తు చేసారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది సివిల్ శిక్షణ అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమాధికారిణి ఎల్.రజని, ప్రధానో పాధ్యాయులు సింహాచలం, గంగా భవాని, మంజులు, రీమలి జాన్, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస పడాల్ పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే గిరిజన చట్టాలకు రక్షణ

- పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-చింతపల్లి:- సిపిఎం గెలుపుతోనే గిరిజన చట్టాలు, హక్కులకు రక్షణ కలుగుతుందని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస తెలిపారు. చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల సిపిఎం కార్యకర్తలతో గురువారం చింతపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి అపారమైన ఖనిజ సంపదను దోచుకు వెళ్లడానికి ఈ ఎన్నికల్లో దొంగ నాయకులు వస్తున్నారని, గిరిజన ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరిని గిరిజనులు ప్రశ్నించి, నిలదీయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి ఏళ్లు కావస్తున్నా గిరిజన ప్రాంత సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటివరకు గిరిజన ప్రాంతం నుండి గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పదవులను ఉపయోగించుకుని సంపాదించుకున్నారే తప్ప స్థానిక గిరిజనులకు, గిరిజన ప్రాంతానికి ఏమాత్రం ఉపయోగపడలేదని మండిపడ్డారు. జీవో 3 రద్దతో గిరిజన నిరుద్యోగ యువత ఆవేదనతో ఉన్నారని, గిరిజన చట్టాలు కళ్ళ ముందు మంట కలిసి పోతుంటే గిరిజన ప్రజా ప్రతినిధులు ప్రేక్షక ప్రాత్ర వహిస్తున్నారని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. బోయ వాల్మీకి లను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తుంటే గిరిజన ప్రజా ప్రతినిధులు తెలిసి కూడా చట్టసభల్లో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మాతృభాష విద్య వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా వారి పొట్ట కొడుతున్నారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి, టిడిపి, బీజేపీ, జనసేన పార్టీలు ఏ పార్టీ గెలిచినా గిరిజనులకు అన్యాయమే తప్ప న్యాయం జరగదన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే సమస్యలపై చట్ట సభల్లో ప్రశ్నిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండలాల కార్యదర్శులు పాంగి ధనుంజయ్, అంపురంగి బుజ్జిబాబు, ఎం పి టి సి, మండల నాయకులు సాగిన చిరంజీవి, పాంగి శ్రీను, సత్తిబాబు, బాలరాజు, సూర్యారావు, చిరంజీవి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -రావికమతం: ఆర్డీవో ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానోజీరావు, తహసిల్దారు రమణారావులు మాట్లాడుతూ, ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటు హక్కుతో మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలు, తాజా ఎన్నికల ప్రక్రియలో అమల్లోకి వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఎన్నికల కోడ్ నిబంధనలు పాటిస్తూ మండలంలో ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం తిలక్, మండల సర్వేయర్, బిఎల్‌వోలు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

రోలుగుంట:ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ ఆదేశాల మేరకు మండల తహశీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు మన హక్కు అని. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ తహశీల్దార్ సోమశేఖర్, సీనియర్ అసిస్టెంట్ పంచదార్ల నరసింగరావు, ఆర్ఐ రామ్మూర్తి, పంచాయతీ కార్యదరర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన..

కోటవురట్ల:మండల కేంద్రంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగదారులు సమస్యలు ఉంటే 1950 తెలియజేయాలన్నారు.

కూరగాయలకు గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో జల్లూరు గ్రామంలో కూరగాయలు పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు రాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ అనంతరం రబీలో ఈ ప్రాంతంలో అధికంగా కూరగాయలు పండిస్తున్నారు. ప్రధానంగా వంగ, బీర, బెండ, టమోటాలు ఇక్కడ నుంచి వివిధ మండలాలకు రవాణా అవుతాయి. ప్రస్తుతం బెండ, వంగ, టమోటాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో వంగ బస్తా రూ.1200 వరకు అమ్మేదని, ప్రస్తుతం 200లకు మించి రాలేదని, అదేవిధంగా బెండ సుమారు 1000 రూపాయల వరకు ఉండేదని, అది కూడా 200 మించి రాలేదని ఆందోళన చెందుతున్నారు. కూలి రేట్లు సైతం రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తెగ నమ్ముకోవాల్సి వస్తుందని అంటున్నారు.

కలెక్టర్, ఎస్‌పిల ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణలు గొలుగొండ మండలంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా ఏజెన్సీ లక్ష్మీపురం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. మౌలిక వసతులు, భద్రత ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గొలుగొండ మండలం ఎర్రన్నపాలెం పోలీస్ చెక్ పోస్టును, కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏజెన్సీ లక్ష్మీపురం పోలీస్ చెక్ పోస్టులను, గొలుగొండ గ్రామం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ను తనిఖీలు నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టాలని, నగదు, బంగారం, వెండి ఇతర విలువైన లోహాలు, ఉచిత కానుకలు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట కేడీపేట ఎస్సై ఉపేంద్ర పాల్గొన్నారు.

నర్సీపట్నం మండలం గబ్బడ ఎంపీయూపీ స్కూల్ పోలింగ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ రవిపట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ గురువారం సందర్శించారు. మౌలిక వసతులు, భద్రత ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి - చీడికాడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మండలంలోని కోనాం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్పోస్ట్ వద్ద భద్రతను పెంచారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

డాక్టర్ బూసి వెంకటస్వామికి మద్రాస్ వర్సిటీ ఉగాది పురస్కారం


డాక్టర్ బూసి వెంకటస్వామి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఏటా ఉగాదిని పురస్కరించుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే ఉగాది పురస్కారం ఈ ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి ఎంపికయ్యారు. వచ్చేనెల 5న చెన్నయిలోని మద్రాస్ విశ్వవిద్యాలయ మెరీనా క్యాంపస్‌లో నిర్వహించే ఉగాది వేడుకల్లో డాక్టర్ వెంకటస్వామికి సినీగేయరచయిత భువనచంద్ర అవార్డును ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు వెల్లడించారు.

.తెలుగు సాహిత్యం, తెలుగు భాష కోసం విశేషకృషిచేసే ప్రముఖులకు ఏటా మద్రాసు విశ్వవిద్యాలయం కోసం కషిచేసే ప్రముఖులకు ఉగాది పురస్కారాన్ని అందజేస్తోంది.ఈ ఏడాది పురస్కార గ్రహీత డాక్టర్ వెంకటస్వామికి ఇప్పటికే గురజాడ పురస్కారం, దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా పురస్కారాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, గురుబ్రహ్మ, ఆచార్య దేవోభవ, మిశ్రమంజరి అవార్డులు వరించాయి. పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో 125 పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయి.150 జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్ర సమర్పణ చేసారు. తనకు మద్రాస్ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాన్ని ప్రకటించటం ఆనందంగా ఉందని డాక్టర్ బూసి వెంకటస్వామి అన్నారు. వెంకటస్వామికి ఉగాది పురస్కారం ప్రకటించడంపై ఎయు తెలుగు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం తథ్యం


పౌరగ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చదువుకోవడానికి చక్కని వాతావరణం ఉందని, విద్యార్థులు, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. గురువారం పౌర గ్రంథాలయాన్నిసందర్శించారు. సెంటర్ ఫర్ పోలీస్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సృజనాత్మక, మంచి సదుద్దేశ్యం కలిగిన వ్యక్తులతో స్థాపించబడిన పౌరగ్రంథాలయం, ఉద్యోగ, విద్యాపరమైన లక్ష్యాలను సాధించడానికి ఉపయోగకరంగా ఉందన్నారు. సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారంతా ఒక ప్రణాళికాయుతంగా, క్రమశిక్షణతో సాధనచేస్తే విజయం సాధించవచ్చన్నారు. పుస్తకాలు అధ్యయనం చేయాలని, దినపత్రికలు నిత్యం చదవాలని, ఆర్థిక సామాజిక విషయాలపై వచ్చే వ్యాసాలు చదివి నోట్స్ తయారు చేసుకోవాలని, ఏకాగ్రత చెడకుండా లక్ష్యంపైనే దృష్టి నిలిపి కృషి చేస్తే సునాయాసంగా విజయలక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. అదృష్టం, దైవంపై భారం వేసినా, నమ్మిన సిద్ధాంతాన్ని క్రమశిక్షణతో ఆచరించి ముందుకు సాగాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి డిఎస్ వర్మ, సెంటర్ ఫర్ పోలీస్ స్టడీస్ ప్రతినిధి ప్రసన్నకుమార్, గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కన్నాపురం గ్రామస్తులకు రేషన్ కార్డులివ్వాలి


మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం: :మండలంలోని కన్నాపురం గ్రామస్తులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. కన్నాపురం గ్రామంలో గురువారం సీపీఎం నాయకులు పర్యటించి సమావేశం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న తమకు ప్రభుత్వం ఓటరు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు, ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇచ్చిందని గాని, రేషన్ కార్డులు ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల బయట కిలో బియ్యం రూ.20 నుండి రూ.30కు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని వాపోయారు. అనంతరం సిపిఎం నేత సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఆదివాసీల ఓట్ల కోసం ఆరాటపడడం తప్ప, వారి జీవనోపాధి కోసం, సంక్షేమ పథకాలు, సాగు భూమి హక్కు పత్రాలు, అభివృద్ధి వంటి విషయాలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆదివాసీలకు రేషన్ కార్డులు, హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు మాడెం బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

30న 'రన్ ఫర్ జీసస్'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అడ్డతీగల : గుడ్ ఫ్రైడే -ఈస్టర్‌కి మధ్యలో వచ్చే శనివారం ఈ నెల 30న ఉదయం 6 గంటలకు కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో అడ్డతీగలలో నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీని జయప్రదం చేయాలని కో-ఆర్డినేటర్ ఆరోగ్య రాజు విజ్ఞప్తి చేశారు. అడ్డతీగలలోని అన్ని సంఘాల కాపరులు, నాయకులు, విశ్వాసులు, యువతీ యువకులు ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. 30న ఉదయం బెయేర్సబా ప్రేయర్ హౌస్ వద్ద అల్పాహారం తీసుకున్న అనంతరం అడ్డతీగల సబ్ స్టేషన్ వద్ద ఈ ర్యాలీని ప్రారంభించి సీతపల్లి సెంటర్, మెయిన్ రోడ్డు గుండా కార్పెంటర్స్ కాలనీ పంచాయతీ ఆఫీసు అల్లూరి సీతారామరాజు కాలనీ, 99 బిల్డింగ్స్, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా సీతపల్లి సెంటర్ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం షాలెం చర్చిలో విందు ఏర్పాటు చేస్తామన్నారు. అడ్డతీగలతో పాటు మరో 75 ప్రదేశాలలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని ఆరోగ్య రాజు తెలియజేశారు.


మాట్లాడుతున్న ఆరోగ్యరాజు

నూతన వేతనాల అమలుకు ఆందోళన తీవ్రతరం

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

ప్రజశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చెల్లింపులో యాజమాన్యం వైఖరి అత్యంత దుర్మార్గమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి విమర్శించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో సక్రమంగా వేతనాలు చెల్లింపు కష్టమేనని, జిందాల్‌కు అప్పగిస్తే ఉత్పత్తి పెరిగి, వచ్చిన లాభాలతో వేతనాలను పెంచి చెల్లించేందుకు ఆస్కారముంటుందని మభ్యపెట్టే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సంపద సమకూరితే కార్మికులకు నూతన వేతనాలు అమలు చేస్తామని బూటకపు మాటలు మానుకోవాలన్నారు. సకాలంలో, సక్రమంగా వేతనాలు చెల్లించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

గురువారం స్టీల్‌ప్లాంట్ సిఎంఎస్ వద్ద నిర్వహించిన స్టీల్ సిఐటియు ఆఫీస్ బేరర్స్ సమావేశంలో రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్న ముడిసరుకుతో మెరుగైన ఉత్పత్తి సాధనకు కార్మికులు కృషి చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్. ఉన్నత యాజమాన్యం పూర్తిస్థాయి ఉత్పత్తి, ఉత్పాదకతలపై దృష్టి సారించకుండా కార్మికులను భయాందోళన, గందరగోళానికి గురిచేసే వైఖరిని మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పదని హెచ్చరించారు. స్టీల్ సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సిహెచ్‌సిల నిర్వహణలో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, నాయకులు బి అప్పారావు, పుల్లారావు, నీలకంఠం, కష్ణమూర్తి, సత్యనారాయణ, మొహిద్దీన్, రమేష్, రమణ, కె ఆర్ కె రాజు, వి ప్రసాద్, శ్రీనివాస్, వి డి వి పూర్ణచంద్రరావు, అరుణ్, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట


వేడుకలో చిన్నారుల కోలాటం

ప్రజాశక్తి-అడ్డతీగల :మండల కేంద్రంలో పునర్నిర్మాణం చేసిన శ్రీప్రసన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో వినాయిక విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పునర్నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించి గురువారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వంకారం బ్రదర్స్ ఆధ్వర్యాన నిర్వహించిన చిన్నారుల కోలాటం అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని ఆంజనేయస్వామి ఆలయం ప్రథమ వార్షిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేసింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆర్ఎన్.రామకృష్ణ, వరప్రసాద్, ధారాజు, ఇవివి.సత్యనారాయణ, శివప్రసాద్, శేఖర్ తదితరులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ధార్మిక సంస్థలు సేవల్లో ముందుండాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ధార్మిక సంస్థలు ప్రజలకు సేవ చేయడంలో ముందుండాలని ఎయు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు పిలుపునిచ్చారు. ఎయులో తత్త్వశాస్త్ర విభాగం, ఆచార్య సచ్చిదానందమూర్తి ధార్మిక అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'ధార్మిక విజ్ఞాన పరిణామం : పాచీన సాంప్రదాయాలపై ఆధునిక దకృథాలు' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగిసింది. తత్తశాస్త్ర శాఖ విభాగాధిపతి ఆచార్య వి వెంకటరావు అధ్యక్షత వహించిన ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, తరచుగా పరిశోధకులతో చర్చలు జరిపితే, విస్తృతమైన ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందన్నారు. సదస్సు సంచాలకులు ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ సదస్సులో 66 మంది పరిశోధనా పత్రాలు సమర్పించారన్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గోవాడ వీర్రాజు అకాడమీ మాజీ ప్రతినిధి విమల రాజగోపాల్, విశ్వవిద్యాలయ తత్తశాస్త్ర విభాగాధిపతి నందిని మిశ్రా, కాకినాడ పిఆర్ కళాశాల ఉపాధ్యక్షులు కందులు ఆంజనేయులు, ఆంధ్ర విశ్వవిద్యాలయ తత్తశాస్త్ర ప్రొఫెసర్ ఎంవి.కృష్ణయ్య, పరిశోధకులు విద్యార్థులు వివిధ రాష్ట్రాల ఆచార్యులు పాల్గొన్నారు.

దివీస్ సౌజన్యంతో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-తగరపువలస :కంబాలకొండ వన్య ప్రాణుల అభయారణ్యం పరిధిలో ఉన్న పిఎం పాలెం నర్సరీ బయో డైవర్సిటి ప్రాంగణంలో సందర్శకుల సౌకర్యార్థం చిప్పాడ దివీస్ సంస్థ సహకారంతో రూ 9.75 లక్షలతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని అటవీశాఖ జిల్లా అధికారి అనంతశంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే స్పందించి ఆర్ఒ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన దివీ స్ యాజమన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వర రావు మాట్లాడుతూ, వివిధ రకాల మొక్కలతో ఏర్పాటుచేసిన ఆక్వాడారియం, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటులో తమను భాగస్వామ్యం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారుభవిష్యత్‌లో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలు చేసేందుకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివీస్ లైజనింగ్ కన్సల్టెంట్ వరహాలరెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ప్రతినిధులు పి శేఖర్‌బాబు, పైడినాయుడు, పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు